సాక్షి
ఖమ్మం
సోమవారం । 20 । మార్చి । 2023



'యాసంగి'పై వర్షం పంజా

యాసంగి పంటలపై వర్షం పంజా విసురుతోంది. మొక్కజొన్న, మామిడి, మిరప రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. 8లో



మార్కుల తనిఖీలు పూర్తి

జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల తనిఖీ పూర్తయింది. ఆన్‌లైన్ నమోదు గడువు నేటితో ముగియనుంది. 10లో



వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం సందర్భంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవేత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలను స్వీకరించారు. ఆదివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



జేవీఆర్ ఓసీలో చేరిన వర్షపు నీరు..

సత్తుపల్లిరూరల్: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. ఓసీల్లోకి భారీగా నీరు చేరడంతో 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి, 1.50 క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపునకు ఆటంకం కలిగిందని సింగరేణి అధికారులు తెలిపారు. వర్షపు నీటిని మోటార్ల సహాయంతో బయటకు పంపిస్తున్నామని చెప్పారు.


స్క్వాష్ కోర్టులో వర్షపు నీరు



ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గల స్క్వాష్ కోర్టు స్లాబ్ పగలడంతో వర్షపు నీరు కారుతోంది. కలపతో నిర్మించిన కోర్టు మొత్తం తడసిపోయింది. కాగా ప్రస్తుతం అందులోనే టేబుల్ టెన్నిస్ బోర్డులను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు స్టేడియంలోని క్రీడాకారులకు ఇచ్చే వసతి కోసం ఏర్పాటు చేసిన గదుల్లో టేబుల్ టెన్నిస్ శిక్షణ కొనసాగుతుండగా, జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెట్కం కార్యాలయాన్ని సైతం ఇక్కడికే మార్చారు. రెండు గదులు కేటాయించడంతో నిరుపయోగంగా ఉన్న స్క్వాష్ కోర్టుకు టేబుల్ టెన్నిస్ బోర్డులను తరలించారు. లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన స్క్వాష్ కోర్టుకు వెంటనే మరమ్మతులు చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

మంట ఆరేదెలా?

జిల్లా అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏళ్ల తరబడి సగం మంది ఉద్యోగులే విధులు నిర్వర్తిస్తుండడంతో వారిపై అదనపు భారం పడుతోంది. వేసవి కాలంలో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియదని, పూర్తి స్థాయిలో సిబ్బంది లేకుంటే ఈ గండాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియడం లేదని ఉన్న ఉద్యోగులు బిక్కుబిక్కుమంటున్నారు. – ఖమ్మంక్రైం



అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత

- ఏళ్ల తరబడి సగం మంది ఉద్యోగులే విధులు
- ఆర్టీసీ నుంచి డ్రైవర్లు.. పోలీసు శాఖ నుంచి హోంగార్డులు
- వేసవిలో పెరగనున్న ప్రమాదాలతో ఆందోళన

ఐదు స్టేషన్లలోనూ సగం మందే..

జిల్లాలో ఐదు అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. ఖమ్మం, వైరా, మధిర, కూసుమంచి, సత్తుపల్లిలో ఫైర్ స్టేషన్లతో పాటు నేలకొండపల్లిలో ఔట్ పోస్ట్ ఏర్పాటు చేశారు. అయితే ఈ ఐదు ఫైర్ స్టేషన్లలోనూ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. జిల్లాలో మొత్తం 50 మంది ఫైర్ మెన్‌లు అవసరం కాగా, చాలా కాలంగా 25 మంది మాత్రమే పనిచేస్తున్నారు. లీడింగ్ ఫైర్‌మెన్‌లు మాత్రం 10కి 10 మంది ఉన్నారు.

నేలకొండపల్లి 'ఔట్' పోస్ట్..

జిల్లాలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకునే మండలాల్లో ముఖ్యమైన నేలకొండపల్లిలోని ఔట్ పోస్ట్ నుంచి ఫైర్ ఇంజన్‌ను ఖమ్మంలోని వ్యవసాయ మార్కెట్‌కు తరలించడంతో అక్కడ ఫైర్ ఇంజన్ కొరత ఏర్పడింది. నేలకొండపల్లి, ముదిగొండ మండలాల్లో వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. మంటలు ఆర్పడానికి ఖమ్మం నుంచి ఫైర్ ఇంజన్‌లు వచ్చేసరికి భారీ నష్టం వాటిల్లుతుంది. గతంలో నేలకొండపల్లి ఔట్ పోస్ట్‌లో ఫైర్ ఇంజన్ ఉండడంతో అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే వెళ్లి మంటలను ఆర్పి ఆస్తి నష్టం జరగకుండా చూసేవారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నేలకొండపల్లిలో ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.



ఖమ్మంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం



అగ్నిమాపక వాహనాలు

ఖమ్మంలో కార్యాలయాలు కరువు..

జిల్లా కేంద్రమైన ఖమ్మంలో అగ్నిమాపక శాఖకు సంబంధించి కార్యాలయాలు కరువయ్యాయి. ఎన్నెస్పీ క్యాంప్‌లో చాలా కాలం క్రితం అగ్నిమాపక శాఖకు స్థలం కేటాయించినా ఇంతవరకు భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో శిథిలావస్థకు చెందిన క్వార్టర్లలోనే కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారి కార్యాలయం ఏళ్ల తరబడి అద్దె భవంలోనే ఉంటోంది.

రూ.3కోట్లకు పైగా ఆస్తి నష్టం

జిల్లాలో 2022 నుంచి గత ఫిబ్రవరి వరకు జరిగిన అగ్ని ప్రమాదాల్లో రూ.3 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిప్రమాద ఘటనలపై సమాచారం అందించేందుకు 396 మంది ఫోన్‌లు చేశారు.

వేసవిలో ప్రమాదాలకు ఆస్కారం..

ఈసారి వేసవి కాలంలో ఎండల తీవ్రత ఎక్కువని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో అగ్ని ప్రమాదాల సంఖ్య భారీగా పెరగవచ్చని పలువురు భయపడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉండడంతో అగ్నిమాపక శాఖ ముందే అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. అగ్ని ప్రమాదాలను అరికట్టడం, ఒకవేళ జరిగితే తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

ఆర్టీసీ డ్రైవర్లే దిక్కు..

ఫైర్ శాఖలో అతి ముఖ్యమైన డ్రైవర్ల పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి. 15 మంది డ్రైవర్లు ఉండాల్సింది కేవలం ఐదుగురు మాత్రమే పనిచేస్తుండడం గమనార్హం. దీంతో ఆర్టీసీ డ్రైవర్లను తీసుకొచ్చి ఫైర్ ఇంజన్‌లు నడిపిస్తున్నారు. ఇక సిబ్బంది కొరత సమస్యను కొంతమేరైనా అధిగమించేందుకు పోలీస్ శాఖ నుంచి హోంగార్డుల సేవలను వినియోగించుకుంటున్నారు. వీరందిరికీ అగ్నిమాపక శాఖ నుంచే వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఎంతో కీలకమైన డ్రైవర్ల కొరత అగ్నిమాపక శాఖను ఇబ్బందులకు గురిచేస్తోంది. నేరుగా అగ్నిమాపక శాఖ నుంచి వచ్చేవారికి ప్రత్యేక తర్ఫీదు ఉంటుంది. ఆర్టీసీ డ్రైవర్లకు మంటలు ఆర్పడం, ఘటనా స్థలాలకు త్వరగా చేరుకోవడం తదితర అంశాలపై అంతగా అవగాహన ఉండదని తెలుస్తోంది.

రూ.15కోట్ల విలువైన ఆస్తులను కాపాడాం

2022 నుంచి ఇప్పటివరకు రూ.15కోట్లకు పైగా విలువైన ఆస్తులను అగ్ని ప్రమాదాల బారి నుంచి కాపాడాం. మా శాఖలో నెలకొన్న సిబ్బంది సమస్యను అధిగమించేందుకు త్వరలోనే పోస్టులు భర్తీ చేస్తాం. ఖమ్మంలో అగ్నిమాపక శాఖ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పోలీస్ హౌసింగ్ బోర్డు వారు త్వరలోనే ఈ భవనాన్ని నిర్మిస్తారు.

– జయప్రకాష్,
ఉమ్మడి జిల్లా అగ్నిమాపకశాఖాధికారి

14 రకాల వస్తువులు అందజేస్తున్నాం

సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల

ఖమ్మంమయూరిసెంటర్ : గురుకులాలకు దీటుగా ఎస్సీ సంక్షేమ శాఖ వసతిగృహాలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన 14 రకాల వస్తువులను అందజేస్తున్నామని ఆ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. నగరంలోని ఎన్ఎస్పీ క్యాంపులో గల బాలుర వసతిగృహంలో ఆదివారం నిర్వహించిన హాస్టల్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొదట అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ వసతిగృహాల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన వసతిని అందించడమే లక్ష్యంగా తమ శాఖ కృషి చేస్తోందన్నారు. అనంతరం వసతిగృహ విద్యార్థులు తమకు అందిస్తున్న 14 రకాల వస్తువులపై ప్రదర్శించిన స్కిట్ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి కోటపాటి రుక్మారావు, ఏఎస్‌డబ్ల్యూఓ ఏ.శ్రీలత, సంక్షేమాధికారులు ఎస్.వెంకటరెడ్డి, ఎండీ అబ్దుల్ రఫూఫ్, ఎండీ అబ్దుల్ సత్తార్, ఎస్.విజయ, ఎం.విజయలక్ష్మి, ఎం.కోమలి, ఏ.శ్రీధర్ పాల్గొన్నారు.



స్కిట్‌లో ఉండే వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కార్యకర్తలే శ్రీరామరక్ష



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

- శ్రేణుల్లో ఉత్తేజం నింపేందుకే ఆత్మీయ సమ్మేళనం
- ఖమ్మం ప్రజలు నన్ను అందరివాడిలా చూసుకుంటున్నారు
- బీఆర్ఎస్ సమ్మేళనంలో మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: పార్టీకి కార్యకర్తలే శ్రీరామరక్ష అని, ఆత్మీయ సమ్మేళనాలు నాయకులు, కార్యకర్తల మధ్య ఆత్మీయ అనుబంధాన్ని బలోపేతం చేస్తాయని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలో ఆదివారం వన్‌టౌన్ ఏరియా పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసి, శ్రేణుల్లో ఉత్తేజం నింపేందుకే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. తనకు బీఆర్ఎస్ ద్వారా వేల మంది కుటుంబాన్ని అందించిన సీఎం కేసీఆర్‌కు కతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి కార్యకర్తను పేరు పెట్టి పిలిచేలా జ్ఞాపకశక్తి ప్రసాదించాలని దేవుడిని కోరుకుంటున్నానని అన్నారు. ఖమ్మం తన ఇల్లని, ప్రజలు తన కుటుంబ సభ్యులని, ఎవరికీ ఇబ్బంది రాకుండా చూసుకుంటానని ప్రకటించారు. దళిత బంధు పథకాన్ని క్షేత్ర స్థాయిలో అందరికీ అందిస్తామని, గడచిన రెండేళ్లలో నియోజకవర్గంలోనే 2,500 ఇళ్లు ఇచ్చామని, ఇంకా మరిన్ని ఇస్తామని అన్నారు. తనను ఖమ్మం ప్రజలు అందరివాడిలా చూసుకుంటారని, మైనారిటీలు ప్రేమతో అజయ్‌ఖాన్ అని, క్రైస్తవులు ప్రభువు బిడ్డగా చూసుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేలా కార్యకర్తలే ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నగరంలో ఒకప్పుడు తాగునీటికి ఇబ్బంది పడేవారని, ట్యాంకర్ల కోసం ఎదురుచూసేవారని, ఇప్పుడా పరిస్థితి ఎక్కడా లేదని చెప్పారు. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికీ శుద్ధమైన తాగునీరు అందిస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఖమ్మంలో కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, జాతీయ పార్టీలు బూజులు దులుపుకుని రోడ్లు ఎక్కుతున్నాయని, వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శేరి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధు, ఎంపీ నామ నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలిచేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

పేదల పక్షాన నిలిచి, వారి సంక్షేమాన్ని ఆకాంక్షించేది బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రమేనని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని 57వ డివిజన్‌లోని 58, 59 జీఓ కింద పేదలకు మంజూరైన 460 ఇళ్ల పట్టాలను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని, జీఓ 58, 59 ద్వారా సొంతింటి కలను సాకారం చేసిందని అన్నారు. ఖమ్మం నగరంలో అత్యధికంగా పేదలు నివసించే రమణగుట్ట, వికలాంగుల కాలనీ వాసులను గతంలో ఏ ప్రభుత్వమూ ఆదుకోలేదని విమర్శించారు. 30 ఏళ్ల క్రితం నాటి ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు హయాంలో పట్టాలు ఇచ్చారని, ఇప్పుడు మళ్లీ తన హయాంలో ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. రానున్న రోజుల్లో సొంత జాగా ఉన్నవారికి ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం తరుపున రూ.3 లక్షలు కూడా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ వి.పి.గౌతమ్, అదనపు కలెక్టర్ మధుసూదన్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, తహసీల్దార్ శైలజ, ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్లు రాపర్తి శరత్, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఆదర్శ నాయకుడు 'రాయల'

సంస్మరణ సభలో పలువురి నివాళి

తిరుమలాయపాలెం: పార్టీ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించిన ఆదర్శ నాయకుడు రాయల నాగేశ్వరరావు అని పలువురు నివాళులర్పించారు. ప్రజల భాగస్వామ్యంతో పిండిప్రోలు గ్రామాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని, విదేశీ ప్రతినిధుల మన్ననలు పొందారని కొనియాడారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో ఇటీవల మృతిచెందిన సర్పంచ్ రాయల నాగేశ్వరరావు సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరి భాగస్వామ్యంతో ముందుకు సాగారని అన్నారు. ఎంతోమంది త్యాగధనుల స్ఫూర్తితో ఆయన పని చేశారని చెప్పారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే ధ్యేయంగా రాయల నాగేశ్వరరావు పని చేశారని అన్నారు. కష్టాలు ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ఉంటారని, ప్రజల కష్టసుఖాల్లో మమేకమై రాయల నాగేశ్వరరావు ప్రజా నాయకుడిగా ఎదిగారని, ఆయన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఎంపీ నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తాగునీటితో అల్లాడిన రోజుల్లో నామ ముత్తయ్య ట్రస్ట్ ద్వారా ట్యాంకర్లతో నీరందించామని, అప్పుడు రాయల నాగేశ్వరరావుతో తనకు సన్నిహిత సంబంధం ఉండేదని గుర్తు చేసుకున్నారు. ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ ఎన్ని నిర్బంధాలు, కష్టాలు వచ్చినా ప్రజల పక్షాన నిలబడిన పోరాడిన నేత రాయల నాగేశ్వరరావు అని నివాళులర్పించారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి రాయల అని కొనియాడారు. సభలో టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ అక్కిన వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు సంభాని చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, ప్రముఖ జర్నలిస్టు పి.వి. శ్రీనివాస్, డాక్టర్లు జగదీష్, జి.వెంకటేశ్వరరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, రాయల చంద్రశేఖర్, రాయల రమ, నున్నా నాగేశ్వరరావు, గోకినపల్లి వెంకటేశ్వరరావు, శివలింగం, సి.వై పుల్లయ్య, ఎడ్లపల్లి నవీన్, వెంకటస్వామి, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, రాయల నాగేశ్వరరావు సతీమణి హైమావతి, కుమారుడు రాజా, కుమార్తె వనజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తాతా మధు, పక్కన ఎంపీ నామ, తుమ్మల, తమ్మినేని, పోటు రంగారావు

పుణ్య జలాల ఆగమనం..

- 12 నదుల నుంచి సేకరించిన అర్చక బృందాలు
- 22న పట్టాభిషేక మహోత్సవానికి అంకురార్పణ
- నేడు మంత్రి అజయ్ ఆధ్వర్యంలో భద్రాచలంలో సమీక్ష



శోభాయాత్రగా ఆలయానికి వెళ్తున్న పుణ్య తీర్థాలు



నదీ జలాలకు పూజలు చేస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పన్నెండేళ్ల కోసారి నిర్వహించే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం ఈ నెల 31న నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి దేశంలోని పన్నెండు నదులు, సముద్రాలు, పుష్కరిణీల నుంచి అర్చకులు పుణ్య నదీ జలాలు సేకరించుకుని ఆదివారం భద్రాచలం తీసుకొచ్చారు. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ దిశలలో ఉన్న గంగా, నర్మదా, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా, కావేరి, భీమరథీ, తపతి, తుంగభద్ర, సింధు, ప్రాణహిత నదీ జలాలతో పాటు పలు పుణ్యక్షేత్రాలలో ఉన్న పుష్కరిణీ తీర్థాలు, సముద్ర జలాలు తెచ్చిన అధికారులు బ్రిడ్జి సెంటర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఉంచారు.

కనుల పండువగా పుణ్య తీర్థ శోభాయాత్ర


అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి నదీ జలాలను దేవస్థానానికి పుణ్యతీర్థ యాత్రగా తీసుకెళ్లారు. నదీ జలాల కలశాలను శేష వాహనంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ రమాదేవి హారతి ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం స్వామివార్ల ఉత్సవ మూర్తుల ముందుండగా, వెనుక నదీ జలాలను మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల శ్రీరామనామస్మరణలు, భజన సంఘాల కోలాటాల నడుమ ఆలయానికి తీసుకెళ్లారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం ఉపాలయంలో భద్రపరిచారు. ఈ నెల 22న యాగశాలలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం 31న మిథిలా స్టేడియంలో జరిగే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకంలో వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్, విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి జగన్నాథాచార్యులు, వేద పండితులు, అర్చకులు, ఆలయ ఏఈఓలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, సీసీ అనిల్, సిబ్బంది శ్రీనివాస రెడ్డి, నిరంజన్, కత్తి శ్రీనివాస్, సాయిబాబ, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

22న అంకురార్పణ

ఈ నెల 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవానికి అంకురార్పణ జరగనుంది. బుధవారం ఆలయంలో నూతన పంచాంగ శ్రవణం, తిరువీధి సేవలు జరగనున్నాయి. 26న ఉత్సవ మూర్తులకు విశేష స్నపనం, బ్రహ్మోత్సవాలకు అంకురారోపణం చేయనున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 27న గరుడ ధ్వజపట భద్రక మండల లేఖనం, గరుడాధివాసం, 28న అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, చతుస్థానార్చనం, భేరీ పూజ, దేవతాహ్వానం, బలిహరణం, హనుమద్వాహన సేవ, 29న ఎదుర్కోలు ఉత్సవం, గరుడ వాహన సేవలు జరుపనున్నారు. 30న శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, శ్రీరామపునర్వసు దీక్షా ప్రారంభం, చంద్రప్రభ వాహన సేవ, 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం, శ్రీరామయణ మహాక్రతు పూర్ణాహుతి, రథోత్సవం జరపనున్నారు. ఏప్రిల్ 1న సదస్యం, 2న తెప్పోత్సవం, చోరోత్సవం, 3న ఊంజల్‌సేవ, 4న వసంతోత్సవం, 5న చక్రతీర్థం, పూర్ణాహుతి, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు సమాప్తి కానున్నాయి. కాగా శ్రీరామనవమి ఏర్పాట్లపై భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అధికారులతో ఉదయం 10 గంటల నుంచి 11.45 గంటల వరకు సమీక్ష జరపనున్నారు. 12.30 గంటలకు కొత్తగూడెంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగే ప్రైవేట్ కార్యక్రమానికి హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

కిన్నెరసానిలో పెరిగిన నీటిమట్టం

పాల్వంచరూరల్: కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు వచ్చిచేరడంతో కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కిన్నెరసానిలో నీటిమట్టం శనివారం 400.70 అడుగులుగా నమోదయింది. వరద నీరు వచ్చి చేరడంతో ఆదివారం 401.20 అడుగులకు పెరిగిందని ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ తెలిపారు. ఇంకా వరద వస్తోందని పేర్కొన్నారు.



కిన్నెరసాని జలాశయం

క్లుప్తంగా

విద్యుత్ స్తంభం విరిగిపడి ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న బాబూరావు

కూసుమంచి: గ్రామంలోని విద్యుత్ స్తంభం విరిగిపడి గ్రామీణ వైద్యుడికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం రాత్రి మండలంలోని చేగొమ్మ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు ఉన్నం బాబూరావు తన ఇంటి ముందు వీధిలో నిల్చున్నాడు. అదే సమయంలో సమీపంలోని ఓ వ్యక్తి చెట్టును నరకుతుండగా చెట్టు విరిగి వీధిలోని విద్యుత్ స్తంభంపై పడింది. ఆ స్తంభం విరిగి పక్కనే ఉన్న బాబూరావుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని హుటాహుటిన ఖమ్మం తరలించారు. బాబూరావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

యువతి అదృశ్యం

చింతకాని: మండలంలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సదరు యువతి ఈ నెల 18న తన స్నేహితుల గ్రామమైన వెంకటాయపాలెం వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. స్నేహితుల గ్రామం వెళ్లిన యువతి ఆచూకీ తెలియకపోవటంతో ఆమె తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పొదిల వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

లోన్ యాప్ మాయ

- యువకుడి ఖాతా నుంచి రూ.30,500 మాయం

కారేపల్లి: మొబైల్ లోన్ యాప్ మాయాజాలానికి ఓ యువకుడు బలయ్యాడు. రూ.30,500 తన ఖాతా నుంచి మాయం కావటంతో.. ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ పుష్పాల రామారావు కథనం ప్రకారం.. భారత్‌నగర్ కాలనీకి చెందిన మద్దెల సాయి తన అవసరాల నిమిత్తం ప్రైవేట్ యాప్‌లో గత జనవరి 8వ తేదీన రూ.5 వేలు లోన్ తీసుకున్నాడు. ఆ తర్వాత జనవరి చివరిలో తన ఖాతా నుంచి అదే మొబైల్ లోన్ యాప్‌లో రూ.5 వేలు చెల్లించాడు. ఈ క్రమంలో తన ఖాతాలో మిగిలి ఉన్న రూ.25,500 పైకం సైతం మాయమైపోయాయి. దీంతో సాయి ప్రైవేట్ లోన్ యాప్ ప్రతినిధులను సంప్రదించే ప్రయత్నం చేయగా ఎలాంటి స్పందన లేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించి ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసును కారేపల్లి పోలీస్ స్టేషన్‌కు రిఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

అధికారులు మందలించారని..

- మనస్తాపంతో ఔట్‌సోర్సింగ్ వర్కర్ ఆత్మహత్యాయత్నం

ఖమ్మంమయూరిసెంటర్: అధికారులు మందలించారనే మనస్తాపంతో కేఎంసీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న స్వీపర్ నాగరాణి గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో బంధువులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా నాగరాణి మీడియాతో మాట్లాడుతూ.. తాను ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్నానని జవాన్ జ్యోతి అసిస్టెంట్ కమిషనర్ దగ్గరకు పిలిపించిందని, డబ్బులు తీసుకున్నానని, తిరిగి ఇప్పిస్తానని చెప్పినా వినకుండా తనను తిట్టారని, దీంతో మనస్తాపానికి గురైనట్లు తెలిపింది. ఇక, నాగరాణి డబ్బులు తీసుకొని జవాన్‌కే ఇచ్చిందని ఆమె బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. దీనిపై కమిషనర్ ఆదర్శ్ సురభిని వివరణ కోరగా ఘటన తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగుపాట్లకు.. పశువులు బలి

వేర్వేరు గ్రామాల్లో 13 దుక్కిటెడ్లు మృతి

గుండాల: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం రాత్రి కురిసిన పిడుగుల వర్షానికి ఆళ్లపల్లి మండలంలోని వేర్వేరు గ్రామాల్లో 13 దుక్కిటెడ్లు మృత్యువాత పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. ఆళ్లపల్లి మండలం సింగారం గ్రామానికి చెందిన పాయం లక్ష్మయ్యకు చెందిన మూడు దుక్కిటెడ్లు, తోలెం నర్సింహారావుకు చెందినవి రెండు, కొమరం రాంబాబుకు చెందినవి రెండు దుక్కిటెడ్లు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఇక నడిమిగూడెం పంచాయతీ సందిబంధం గ్రామానికి చెందిన బొమ్మల లక్ష్మయ్యకు చెందినవి మూడు, ఈసం సత్యం, బొమ్మల ఆంజనేయులు, అడవి రామారం గ్రామం పాయం పుల్లయ్యకు చెందిన ఒక్కో దుక్కిటెద్దు మృత్యువాత పడ్డాయి. ఒక్కో దుక్కిటెద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని ప్రభుత్వం తమను నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781



‘యాసంగి’పై వర్షం పంజా

- నాలుగు రోజులుగా వెంటాడుతున్న అకాల వర్షాలు
- మొక్కజొన్న రైతుల స్థితి దయనీయం
- మామిడిని దెబ్బతీస్తున్న ఈదురుగాలులు
- కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి, మొక్కజొన్న రక్షణకు రైతుల పాట్లు



రఘునాథపాలెం మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతులు

ఖమ్మంవ్యవసాయం: యాసంగి పంటలపై వర్షం పంజా విసురుతోంది. వానాకాలం సీజన్‌లో విస్తారంగా కురిసిన వర్షాలకు జలాశయాల్లో సమృద్ధిగా నీళ్లు ఉండటంతో రైతులు ఆనందంగా యాసంగి పంటలను సాగు చేశారు. ఈ తరుణంలో అకాల వర్షాలు పంటలను దెబ్బతీశాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు గురువారం నుంచి రోజూ పడుతూనే ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ప్రధానంగా చేతికందే దశలో ఉన్న మొక్కజొన్న పంట నేలపాలైంది. పూత, పిందె దశలో ఉన్న మామిడి రాలిపోయింది. కల్లాల్లో ఉన్న మిర్చి, మొక్కజొన్న పంటలను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో జిల్లాలో 3,14,936 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. వాటితో పాటు ఉద్యాన పంటలు మామిడి 33,800 ఎకరాల్లో, మిర్చి 70 వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రధానంగా వరి 2,14,977 ఎకరాల్లో సాగు చేయగా, మరో పంట మొక్కజొన్న 90,706 ఎకరాల్లో సాగు చేశారు. పెసర 3,424 ఎకరాల్లో సాగు చేశారు.

నష్టం తీవ్ర ఎక్కువే..

అకాల వర్షాలు పంటలకు తీరని నష్టం కలిగిస్తున్నాయి. జిల్లాలో ప్రధానంగా సాగు చేసిన వరి సత్తుపల్లి, కూసుమంచి వ్యవసాయ డివిజన్లలో కోత దశకు చేరుతుండగా, వైరా, ఖమ్మం, మధిర వ్యవసాయ డివిజన్లలో సుంకు నుంచి పొట్ట దశలో ఉంది. ఈ దశల్లో ఉన్న పంటపై వడగళ్ల వానలు పడుతుండటంతో సుంకు రాలిపోతోందని, ధాన్యం తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల కోత దశకు వచ్చిన వరి దెబ్బతినే ప్రమాదం కూడా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక మధిర, కూసుమంచి, ఖమ్మం వ్యవసాయ డివిజన్లలో 90,706 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న కొన్నిచోట్ల కంకి విరిచి ఆరబెడుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో కోత దశలో ఉంది. మరో 20 రోజుల్లో పంట పూర్తిగా చేతికందే అవకాశం ఉంది. ఈ దశలో ఈదురుగాలులు, అకాలవర్షాలకు పంట పూర్తిగా నేలమట్టమైంది. కంకి తేమ బారిన పడి నాణ్యత దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. నేలపై వాలిన మొక్కజొన్న పంట కోత కూడా ఇబ్బందికరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి చివరి కోతల్లో ఉంది. కోసిన మిర్చిని పలుచోట్ల కల్లాల్లో ఆరబెడుతున్నారు. ప్రస్తుతం రూ.23 వేల ధర పలుకుతున్న స్థితిలో అకాల వర్షాలు కురుస్తుంటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో నెల రోజుల్లో చేతికందే మామిడి పంటకూ నష్టం జరుగుతోంది. ఈదురుగాలులకు పూత, పిందె, కాయ రాలుతోంది. ఈ ఏడాది మామిడిని సామాన్య మధ్యతరగతి వర్గాలు రుచి చూస్తారా..? లేదా..? అనే చర్చ కూడా సాగుతోంది.

నివేదిస్తున్న వ్యవసాయ శాఖ

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ ఏరోజుకారోజు రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్‌కు నివేదికల రూపంలో అందిస్తున్నారు. పంటల్లో ప్రధానంగా మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ నివేదికలను అందిస్తోంది. ఆదివారం వరకు జిల్లాలో 10,418 మంది రైతులకు చెందిన 20,748 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. కాగా, ద్రోణి కారణంగా గురువారం నుంచి వర్షాలు కురుస్తుండగా, ఆదివారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో ఓ మోస్తరు నుంచి బారీ వర్షం కురిసింది. జిల్లా సగటు వర్షపాతం 3.36 సెంమీలుగా నమోదైంది. సత్తుపల్లి మండలంలో 8.32 సెంమీ, వేంసూరు మండలంలో 8.14 సెం.మీల వర్షపాతం నమోదైంది. 3 నుంచి 6 సెం.మీల మధ్య 15 మండలాల్లో, 1 నుంచి 3 సెం.మీల మధ్య 4 మండలాల్లో వర్షపాతం నమోదైంది.

వ్యవసాయ డివిజన్ల వారీగా పంట నష్టాల వివరాలు ఎకరాల్లో

	మొక్కజొన్న	పెసర	ఇతర పంటలు	మొత్తం
ఖమ్మం	563	105	--	668
కూసుమంచి	525	34	05	564
మధిర	12,728	53	--	12,781
సత్తుపల్లి	312	--	--	312
వైరా	6,419	--	04	6,423
మొత్తం	20,547	192	09	20,748

ప్రశ్నపత్రాల లీకేజీ ప్రభుత్వ వైఫల్యమే..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన



దిష్టిబొమ్మతో వస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంసహకారనగర్: టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రభుత్వమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సరైన న్యాయం జరగడం లేదనే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, ఇక్కడ కేసీఆర్ పాలనలో ఉద్యోగ నియామకాలు అవినీతి, అక్రమాలతో నిండిపోయాయని ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నపత్రాల లీకేజీపై ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని, అనేక ఏళ్లుగా కొందరు కుటుంబాన్ని, ఇంటిని వదిలి గ్రంథాలయాల చుట్టూ, రీడింగ్ రూం వెంట తిరుగుతూ కష్టపడి చదువుకోగా ప్రభుత్వం వారి పట్ల దయలేకుండా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పెట్టిన ప్రెస్‌మీట్ హాస్యస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కాగా, పార్టీ కార్యాలయం నుంచి కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మతో వస్తుండగా వారిని పోలీసులు అడ్డుకొని టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్, నాయకులు యడ్లపల్లి సంతోష్, మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ హుస్సేన్, మలీదు వెంకటేశ్వర్లు, సైదులు, భారతిచంద్రం, మిక్కిలినేని మంజులనరేందర్, ముస్తఫా రఫీదాబేగం, శంకర్, రవి, నాగేశ్వరరావు, నాగటి చంద్రం, శ్రీశైలం పాల్గొన్నారు.

అ‘పూర్వ’ కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యనభ్యసించిన 1991–92 ఏడాది పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు జమలాపురం గ్రామంలోని శ్రీబాలాజీ భవనంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. దూర ప్రాంతాల్లో స్థిరపడి జీవిస్తున్న స్నేహితులు ఒక్కచోట కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకున్నారు. అందరూ కలిసి సెల్ఫీలు దిగారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడు ఫకీరయ్యకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నందిగం వెంకయ్య, బుర్రా నారాయణ, బాబూఖాన్, కూరెళ్ల మురళి, ఎస్‌కే ఇమాంసాహెబ్, ఎన్.వెంకటేశ్వరరావు, గంధం నాగమల్లేశ్వరి, శ్రీదేవి, శివపార్వతి, కృష్ణవేణి, హనుమంతరావు, మోహన్‌బాబు, తిరుమల్‌రావు, నాగవేణి, మంజుల, లత తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

తల్లీ, కుమారుడు మృతి



ఉప్పల్‌రాజు (ఫైల్)



కాంతమ్మ (ఫైల్)

ఖమ్మంరూరల్/కూసుమంచి: ఓ ఫంక్షన్‌కు హాజరైన తల్లీ, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన మండలంలోని పాన్నెకల్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కూసుమంచి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన మల్లెబోయిన ఉప్పల్‌రాజు (45).. తన తల్లి కాంతమ్మ(75)ను బైక్‌పై ఎక్కించుకుని తన సోదరుడు గంగమ్మతల్లి ఫంక్షన్ చేస్తుండగా వెళ్లాడు. అక్కడ అందరితో కలిసి భోజనం ముగించుకొని తిరిగి ముత్యాలగూడెం బయలుదేరారు. మార్గమధ్యలో పాన్నెకల్ వద్దకు రాగానే సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వస్తున్న ఖమ్మం డిపోకు చెందిన ఆర్‌టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న తల్లీ, కుమారుడు రోడ్డుపై ఎగిరిపడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంటికి పెద్ద దిక్కు అయిన ఉప్పల్‌రాజు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు ఉప్పల్‌రాజుకు భార్య ఉమా, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి లారీడ్రైవర్ మృతి

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని నారాయణపురం గ్రామం వద్ద మొక్కజొన్నలోడ్‌తో వెళ్తున్న లారీకి విద్యుత్ వైర్లు తగలటంతో విద్యుదాఘాతానికి గురై డ్రైవర్ వి.పవన్‌కుమార్(20) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు ప్రకాష్‌నగర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.

యువకులపై వీధి కుక్క దాడి

పినపాక: ఇద్దరు యువకులపై కుక్క దాడి చేసి గాయపరిచిన ఘటన పినపాక మండల కేంద్రంలోని ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండీ అశ్వక్, వాడపల్లి సాయిపవన్, ఇరువురు ఆదివారం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క వెంటాడి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన స్థానికులు వీరిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రియుడితో కలిసి భర్తపై దాడి..

చికిత్స పొందుతూ మృతి



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): తాళి కట్టిన భర్తను ప్రియుడితో కలిసి దాడి చేసి హతమార్చిన ఘటన ఆదివారం వన్‌టౌన్ పరిధిలోని సన్యాసి బస్తిలో వెలుగు చూసింది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెం సన్యాసిబస్తిలో పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న జి.ప్రవీణ్‌కుమార్(33) సుమారు అయిదేళ్ల క్రితం లావణ్యను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి దాంపత్య జీవితం సజావుగా సాగుతున్న క్రమంలో రెండేళ్ల క్రితం కొత్తగూడెంలోని ఎంజీ రోడ్డులో గల ఓ బట్టలషాపులో పనిచేసే సుమంత్ అనే యువకుడితో లావణ్యకు పరిచయం ఏర్పడి.. చనువు పెరిగి శారీరక సంబంధానికి కారణమైంది. ఈ విషయం భర్త ప్రవీణ్‌కుమార్‌కు తెలియడంతో పలు మార్లు హెచ్చరించినా వారిలో మార్పు రాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో భార్యభర్తలతో పాటు వారివురి కుటుంబసభ్యులను పిలిచి కౌన్సిలింగ్ చేశారు. అయినా లావణ్యలో మార్పు రాకపోగా.. భర్తకు విడాకులు ఇవ్వకుండానే భర్త ఇంటి ముందే వేరొక ఇల్లు తీసుకొని సుమంత్‌తో చనువుగా ఉంటుంది. ఈ క్రమంలో శనివారం రాత్రి వారి మధ్య గొడవ జరుగగా.. ప్రవీణ్‌కుమార్‌ను తీవ్రంగా కొట్టారు. ఈలోగా అందిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి సర్దిచెప్పి పంపించారు. తర్వాత ఆదివారం మరలా వారి వద్దకు వెళ్లి నన్ను ఎందుకు కొట్టారని ప్రశ్నించడంతో లావణ్య ప్రియుడితో కలిసి రోకలి బండ, రాళ్లతో తలపై, నడుము, కాళ్లపై విచక్షణా రహితంగా దాడి చేయగా.. రక్తపు మడుగులో పడి ఉన్న ప్రవీణ్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలిసిన లావణ్య, సుమంత్‌లు పరారు కాగా మృతుడు తండ్రి కొమరయ్య ఫిర్యాదు మేరకు వన్ టౌన్ ఎస్సై కేసు నమోదు చేయగా, ఇన్‌చార్జ్ సీఐ ఎల్ రాజు విచారణ జరిపిస్తున్నారు.

ఫిట్స్‌తో యువకుడు మృతి



మధు (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం గ్రామంలో ఆదివారం ఫిట్స్‌తో యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శ్యామిలేటి మధు (20) ఆదివారం సాయంత్రం ఇంటి ముందు శుభ్రం చేస్తుండగా.. అనుకోకుండా ఫిట్స్ వచ్చి.. ఇంటి ముందు ఉన్న డ్రెయినేజీలో పడ్డాడు. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవటంతోపాటు తల నీళ్లలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మధు మృతదేహం వద్ద తల్లి రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. నిరుపేద కుటుంబం కావటంతో విక్రమ్ మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి, ఇల్లెందు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఏఈ గుద్దేటి రవి రూ.6 వేలు అందించారు. మృతదేహాన్ని సర్పంచ్ దండా పుల్లయ్య, ఎంపీటీసీ సభ్యుడు జటంగి చంద్రమ్మ, సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తితో పాటు వడ్లమూడి సంపత్, వీరబాబు, సొందుమియా, రవికుమార్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు: పండ్ల దుకాణంలో పని చేసే ఓ యువకుడు విద్యుదాఘానికి గురై తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. పోలీస్ స్టేషన్ పరిధిలో జూలూరుపాడుకు చెందిన కమల ఓ పండ్ల వ్యాపారం నడుపుతోంది. సుజాతనగర్ మండలం సింగభూపాలెంకు చెందిన కమల అక్క కుమారుడు గోరంట్ల ప్రవీణ్ అనే యువకుడు అందులో పని చేస్తున్నాడు. గత ఐదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పండ్లు, కూరగాయాలు తడిసిపోకుండా, ఎండ తీవ్రతకు దెబ్బతినకుండా ఉండేందుకు ప్రవీణ్ దుకాణంపై పట్టా కడుతున్నాడు. పండ్ల దుకాణంపైన 11 కేవీ విద్యుత్ లైన్ ఉన్న విషయాన్ని గమనించని ప్రవీణ్ పట్టాకు బైండింగ్ వైర్ చుట్టే క్రమంలో విద్యుత్ లైన్ తగిలి విద్యుదాఘానికి గురయ్యాడు. అంతలోనే అటుగా వెళ్తున్న వారు గమనించి కర్రతో తీగను కొట్టడంతో ప్రవీణ్ కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి ఆపై ఖమ్మంకు తరలించారు.

వైన్ షాపులో చోరీయత్నం..

ఆటో వదిలి పారిపోయిన దొంగలు



సీసీ ఫుటేజ్‌లో చోరీ చేస్తున్న దొంగ

పాల్వంచరూరల్: వైన్ షాపుకు కన్నం వేసిన దొంగలు చోరీయత్నానికి పాల్పడి ఆటోను అక్కడే వదిలేసి వెళ్లిన సంఘటన పెద్దమ్మగుడి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. షాపు నిర్వాహకుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దగుడి సమీపంలో గల ఓ వైన్ షాపులో శనివారం అర్ధరాత్రి ఆటోలో ఇద్దరు దొంగలు వచ్చి షాపు వెనుక గోడకు కన్నం వేశారు. అందులో ఒక దొంగ లోపలికి వెళ్లగా.. మరో దొంగ బయట కాపలాగా ఉన్నాడు. లోపలికి వెళ్లిన దొంగ మద్యం సీసాలను చోరీ చేసి తీసుకెళ్తుండగా రూ.20వేలు విలువ చేసే మద్యం సీసాలు కింద పడి పగిలిపోయాయి. షాపు లోపల ఉన్న సీసీ కెమెరా సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకున్న షాపు నిర్వాహకుడు కార్తీక్ షాపులో దొంగలు పడ్డ దృశ్యాలను చూసి షాపువద్దకు చేరుకున్నాడు. అలికిడి విన్న దొంగలు ఆటోను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఆదివారం షాపు నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

టేకులపల్లిలో చోరీ..

టేకులపల్లి: మండల కేంద్రంలో చోరీ జరిగిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఎదురు సెంటర్, ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన నాగరాజు శైలజ దంపతులు రెండు రోజుల కిందట ఊరికి వెళ్ళారు. ఆదివారం ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు ఫోన్ ద్వారా వారికి సమాచారం అందజేయడంతో ఆదివారం శైలజ ఇంటికి వచ్చి చూసే సరి కి తలుపులు పుగులకొట్టి ఇంట్లో బీరువా తెరిచి కనిపించింది. మొత్తం పరిశీలిస్తే తులంన్నర బంగారం దిద్దు లు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే టేకులపల్లి ఎస్ఐకి ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

పెళ్లిబస్సును ఢీకొట్టిన బైక్..

సింగరేణి(కొత్తగూడెం): పెళ్లి బస్సును ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటన ఆదివారం రాత్రి కొత్తగూడెం టూ టౌన్ పరిధిలోని రామవరంలో జరిగింది. టూటౌన్ ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. రామవరం మహిళా కళాశాల హాస్టల్ వద్ద ఎదురుగా వస్తున్న పెళ్లి వాహనాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వా ఆస్పత్రిలో వార్డ్‌బాయిగా పనిచేస్తున్న దుర్గమల్లేశ్వరరావు ద్విచక్రవాహనంపై వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దుర్గమ ల్లేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. కాగా, దుర్గమల్లేశ్వరరావు పాతకొత్తగూడెంలోని అత్తగారింటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదం చోటుచేసుకుంది.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై ఆచితూచి..

- అన్ని కోణాల్లోనూ పరిశీలించిన తర్వాతే ముందుకు..
- 35 లక్షల పేపర్ల వాల్యుయేషన్‌పై నేడు ఇంటర్ బోర్డు నిర్ణయం!



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం (వాల్యుయేషన్)పై బోర్డు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. భద్రత ఎంతవరకు అనే అంశం తెర పైకి రావడంతో దీనిపై ఆచితూచి అడుగేయాలని భావిస్తున్నారు. అన్ని కోణాల్లోనూ చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకోనున్నారు. ఈ అంశంపై సోమవారం ఉన్నతాధికారులు భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ నెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. వచ్చే నెల 4వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. పరీక్షలు జరుగుతుండగానే పూర్తయిన పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనానికి బోర్డు ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఏడాది 35 లక్షల జవాబు పత్రాలను ఆన్‌లైన్ ద్వారా మూల్యాంకనం చేయాలని నిర్ణయించారు.దీనికోసం టెండర్లు కూడా పిలిచారు. మొదటిసారి ఒకే ఒక సంస్థ ముందుకు రావడంతో టెండర్లు రద్దు చేసి రెండోసారి పిలిచారు. ఈసారి రెండు సంస్థలు ముందుకొచ్చాయి. ఎల్–1 సంస్థను సోమవారం ఖరారు చేయాలని నిర్ణయించారు.

డేటా చోరీ నేపథ్యంలో..

ప్రస్తుతం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారం రాష్ట్రాన్ని కుదిపేస్తోంది. కొన్ని నెలల క్రితం బోర్డులోనే డేటా ట్యాంపరింగ్ జరిగింది. ఓ వ్యక్తి అక్రమంగా కీలకమైన భద్రత డేటాను దొంగిలించినట్టు బోర్డు గుర్తించింది. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే బోర్డులోని భద్రత వ్యవస్థ చర్చనీయాంశమయ్యింది. డేటా ట్యాంపరింగ్ వ్యవహారం తర్వాత నిపుణుల చేత పూర్తిస్థాయి సాంకేతిక పరీక్షలు చేపట్టిన ఉన్నతాధికారులు.. మరింత లోతుగా విశ్లేషణ అవసరమని భావిస్తున్నారు.

అన్ని కోణాల్లో పరిశీలించాకే..

ఆన్‌లైన్ మూల్యాంకనం చేపట్టే విషయాన్ని పరిశీలిస్తున్నాం. దీనిపై ఇంకా పూర్తిస్థాయి నిర్ణయానికి రాలేదు. ఆఫ్‌లైన్‌తో పాటు పాక్షికంగా ఆన్‌లైన్లో చేపట్టే ఆలోచనపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం. టెండర్ల విషయంలో సోమవారం ఓ నిర్ణయానికి వచ్చే వీలుంది. ఏది ఏమైనా అన్ని కోణాల్లోనూ ఈ అంశాన్ని పరిశీలించిన తర్వాతే ఓ నిర్ణయానికొస్తాం.

– నవీన్ మిత్తల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి

చిన్నోనిపల్లి అష్టదిగ్బంధం

'నెట్టెంపాడు' రిజర్వాయర్ భూనిర్వాసితుల గ్రామంలో 144 సెక్షన్

- నిరసన దీక్షలు చేస్తున్న నిర్వాసితులను అర్ధరాత్రి అరెస్టు చేసిన పోలీసులు
- గ్రామంలోని పురుషులందరినీ అదుపులోకి తీసుకున్న వైనం
- పనులను అడ్డుకొనేందుకు మహిళల విఫలయత్నం



చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు జరిగే చోటుకు వెళ్తున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

గద్వాల రూరల్/గట్టు: జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం చిన్నోనిపల్లిని పోలీసులు అన్ని వైపులా చుట్టుముట్టారు. గ్రామంలో 144 సెక్షన్ విధించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గ్రామ సమీపంలో రిజర్వాయర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ గత కొంతకాలంగా నిరసన దీక్షలు చేస్తున్న వారందరినీ శనివారం అర్ధరాత్రి మొదలు ఆదివారం తెల్లవారుజాము వరకు అరెస్టు చేశారు. గ్రామం మొత్తం జల్లెడపట్టి కనిపించిన మగవారందరినీ అదుపులోకి తీసుకున్నారు. దీంతో మహిళలు నిర్మాణ పనులను అడ్డుకొనేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.

ఇప్పటికే 90 శాతం పూర్తి..

జోగుళాంబ గద్వాల జిల్లా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామ సమీపంలో 1.50 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను 2006లో నిర్మించేందుకు పూనుకున్నారు. మూడేళ్లపాటు నిరాటకంగా సాగిన పనులు సుమారు 90 శాతం మేర పూర్తయ్యాయి. ఈ క్రమంలో రాక్ వర్క్ పనులకు సంబంధించి బ్లాస్టింగ్ చేయగా కొన్ని మట్టి మిద్దెలు, పాత ఇళ్ల నెర్రెలు ఇచ్చి కూలిపోయాయి. బ్లాస్టింగ్ పనులను సదరు కాంట్రాక్టర్ రాత్రివేళ కొనసాగించడంతో అప్పట్లో గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. అలాగే గ్రామాన్ని ఖాళీ చేయడానికి నిరాకరించారు. దీంతో పనులు నెమ్మదించి 2009 నాటికి పూర్తిగా ఆగిపోయాయి. తాజాగా 16 ఏళ్ల తర్వాత రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి మిగిలిన 10 శాతం పనులను పోలీసు పహారా మధ్య అధికారులు ప్రారంభించారు. ఇరిగేషన్ శాఖ ఈఈ రహీముద్దీన్, ఆర్డీఓ రాములు, డీఎస్పీ రంగస్వామి పనులను దగ్గరుండి కొనసాగిస్తున్నారు.

423 రోజులుగా దీక్షలు...

పచ్చని పంటలు పండిస్తూ హాయిగా జీవిస్తున్న గ్రామస్తులకు రిజర్వాయర్ నిర్మాణం గుదిబండగా మారింది. దశాబ్దాలుగా వ్యవసాయాన్నే నమ్ముకొని జీవనం సాగిస్తున్న భూములతోపాటు నివాసముంటున్న చిన్నోనిపల్లి గ్రామం సైతం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతుందనే విషయం తెలుసుకున్న రైతులు ఎందరు అధికారులను కలిసి రిజర్వాయర్ నిర్మించొద్దని కోరినా ఫలితం లేకపోయింది. దీంతో 'రిజర్వాయర్ రద్దు'కోసం గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఏకంగా 423 రోజుల పాటు దీక్షలు చేసిన నిర్వాసితులను రాత్రి రాత్రికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే రిజర్వాయర్ కింద ఒక్క ఎకరా ఆయకట్టు లేనప్పటికీ ప్రభుత్వం రైతుల ఆవేదనను పట్టించుకోకుండా పోలీసు బలగాలతో నిర్మాణ పనులు చేపడుతుండటాన్ని విపక్షాలు తప్పుబడుతున్నాయి. అధికార బీఆర్ఎస్ మినహా బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నేతలంతా ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. రైతులకు జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని, మరో ఉద్యమానికి సిద్ధమవుతామని ప్రకటించారు.

మళ్లీ జీవీకే చేతికి '108'

- 102, 104 సేవలు కూడా ఆ సంస్థకే అప్పగింత
- ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి పేదల శవాల తరలింపు కూడా..
- మండలానికో అంబులెన్స్ ఇవ్వాలని కీలక నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించే '108'వాహన టెండర్‌ను మళ్లీ జీవీకే సంస్థే దక్కించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో జీవీకేతోపాటు మరో కంపెనీ పాల్గొంది. చివరకు జీవీకే సంస్థకే టెండర్ దక్కినట్లు వైద్య, ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు ఈసారి 102 అమ్మ ఒడి, 104, ప్రభుత్వ ఆసుపత్రులనుంచి పేదల శవాలను వారి సొంతూళ్లకు ఉచితంగా తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాల బాధ్యత కూడా జీవీకేకే అప్పగించారు. ప్రస్తుతం 50 వాహనాలు పేదల శవాలను ఆసుపత్రుల నుంచి సొంతూళ్లకు ఉచితంగా తీసుకెళ్తున్నాయి. ఈ నాలుగు సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఆ సంస్థకు బాధ్యతలు అప్పగించారు.

ప్రస్తుతం 358 వాహనాలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో '108'అత్యవసర అంబులెన్స్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో అకస్మాత్తుగా వైద్యం అవసరమైన వారు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు '108'నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా ఈ అంబులెన్స్ సేవలను ఉచితంగా పొందుతున్నారు. ప్రస్తుతం 358 వాహనాలు '108'అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నాయి. వాటిల్లో 333 రోడ్లపై అందుబాటులో ఉండగా, మిగిలిన వాటిని రిజర్వులో ఉంచారు. అప్పట్లో కొన్ని వాహనాలు చెడిపోగా, వాటి స్థానంలో కొన్ని వాహనాలను గిఫ్ట్ ఎ స్మైల్ కింద రాజకీయ నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు ఉచితంగా ఇచ్చారు. ప్రస్తుతం లక్ష మంది జనాభాకు ఒకటి చొప్పున '108'వాహనం ఉందని అధికారులు చెపుతున్నారు. ఫోన్ చేసిన దాదాపు 20 నిమిషాల్లో అంబులెన్స్ బాధితుల వద్దకు చేరుకోవాలనేది నిబంధన. ఈ అంబులెన్స్ సర్వీసులను ప్రస్తుతం కూడా జీవీకే సంస్థనే నిర్వహిస్తోంది. ఇప్పటివరకు 108 వాహనాల నిర్వహణకోసం ప్రభుత్వం ఏడాదికి రూ. 86 కోట్ల మేర ఖర్చు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఈసారి ఎంతకు ఖరారు చేశారన్న దానిపై స్పష్టత లేదు.

పలు మార్పులకు శ్రీకారం..

ప్రస్తుతమున్న '108'అంబులెన్స్ సేవల్లో పలు మార్పులు చేయాలని భావిస్తున్నారు. ఈ మేరకు జీవీకే సంస్థ ఏర్పాట్లు చేసే అవకాశముంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేట్ ఆఫ్ ఆర్ట్ కాల్ సెంటర్‌కు రూపకల్పన చేస్తారు. దాని ద్వారా కంప్యూటర్ ఆధారంగా అంబులెన్సులను ఆటోమాటిక్‌గా నడిపిస్తారు. ఆటోమాటిక్ కాల్ డిస్ట్రిబ్యూటర్ (ఏసీడీ) వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. కంప్యూటర్ టెలిఫోనీ ఇంటర్‌ఫేస్ (సీటీఐ), వాయిస్ లాగింగ్ కేపబిలిటీస్, జీపీఎస్ ఇంటిగ్రేషన్, హైలీ సెక్యూర్డ్ నెట్‌వర్క్‌లను రూపొందిస్తారు. ఈ వ్యవస్థ ప్రస్తుతానికే కాకుండా భవిష్యత్ అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. అంతేకాక దీనిని విపత్తు నిర్వహణ విభాగానికి అనుసంధానం చేస్తారు. ఇది పోలీస్, ఫైర్ సర్వీసులతోనూ అనుసంధానం అవుతుంది. అన్ని '108'అంబులెన్స్‌లకు జీపీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేస్తారు. అలాగే ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. బాధితుడిని తీసుకెళ్లే ఆసుపత్రికి ముందస్తు సమాచారం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తారు. అన్ని కార్పొరేట్ కంపెనీల్లోనూ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా ఉంది.

మండలానికో '108'వాహనం..

ఇకపై ప్రతీ మండలానికి ఒక '108'వాహనాన్ని సమకూర్చాలని సర్కారు యోచిస్తోంది. తద్వారా దాని పరిధిలోని సమీప గ్రామాలకు తక్కువ సమయంలో చేరుకోవడానికి వీలు కలుగుతుందని, అనేకమందిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చనేది ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం లక్ష మంది జనాభాకు ఒకటి చొప్పున '108'వాహనం ఉండగా, మండలానికి ఒకటి కేటాయించడం ద్వారా ప్రతీ 70 వేల జనాభాకు ఒకటి అందుబాటులోకి తీసుకురావాలని అనుకుంటున్నారు.

రణరంగంగా మోతె

- భూ వివాదంతో ఉద్రిక్తత
- రెండు వర్గాల ఘర్షణ



ఎస్సీలు ఏర్పాటు చేసిన కంచె, జెండాలను తొలగిస్తున్న గ్రామస్తులు

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామంలోని 333 సర్వే నంబరు భూమిపై ఎస్సీలు, గ్రామస్తుల మధ్య చాలా ఏళ్లుగా కొనసాగుతున్న భూ వివాదం ఆదివారం ఘర్షణకు దారితీసింది. మోతె రాజరాజేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోని 333 సర్వేనంబరులోని సుమారు ఎకరన్నర భూమి రికార్డుల పరంగా మొదటినుంచి తమదేనని ఎస్సీలు ఇస్సాపల్లి నడ్పిగంగారం, రవి, ప్రతాప్ పేర్కొంటున్నారు. ఈ భూమిని పూర్వకాలంలో ఎస్సీలు రాజరాజేశ్వరస్వామి ఆలయానికి ఇచ్చారని, యేటా జాతరకు ఈ భూమిని ఉపయో గించుకుంటామని గ్రామస్తులు వాదిస్తున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య చాలా ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. గతంలో ఎస్సీలు భూమిని దున్ని పంట వేయగా గ్రామస్తులు తొలగించారు. గతేడాది గ్రామస్తులు ఆ భూమిలో విగ్రహాలు ఏర్పాటు చేయగా ఎస్సీలు తొలగించారు. ఎస్సీలు ఆ భూమికి ఇటీవల కంచె ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వీడీసీ ఆధ్వర్యంలో ఇంటికొకరు చొప్పున రాజరాజేశ్వర ఆలయానికి చేరుకొని సమావేశమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సీలు తమ అనుచరులు, బంధువులు, దళిత సంఘాల నేతలతో కలిసి భూమి వద్దకు చేరుకున్నారు. ఎస్సీలు ఏర్పాటు చేసిన కంచెను, జెండాలను గ్రామస్తులు తొలగించారు. అడ్డు వచ్చిన వారిపై దాడికి పాల్పడ్డారు. అదే సమయంలో భీమ్‌గల్ వైపు వెళ్తున్న బాల్కొండ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు.. ఘర్షణను చిత్రీకరిస్తుండగా వారిపై దాడికి పాల్పడి పరికరాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్ రెడ్డి, వేల్పూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారిని చెదర గొట్టారు. ఎస్సీ వర్గీయులు తమపై దాడికి పాల్పడిన గ్రామస్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యే గణేశ్ గుప్తాకు తప్పిన ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా వాహనం

కామారెడ్డి టౌన్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తాకు పెను ప్రమాదం తప్పింది. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎమ్మెల్యే కాన్వాయ్ మధ్యకు ఓ ప్రైవేటు వాహనం రావడంతో ప్రమాదం జరిగింది. కాన్వాయ్ కామారెడ్డి పట్టణంలోని సిరిసిల్ల రోడ్డులో జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే.. ఢిల్లీ నుంచి కేరళ వైపు వెళ్తున్న వాహనం ఎమ్మెల్యే వాహనం వెనక్కు వచ్చింది. ఆ కారు వేగం నెమ్మదించడంతో వెనకాల ఉన్న ఎమ్మెల్యే కాన్వాయ్ వాహనం ఢిల్లీ కారును ఢీకొనగా.. అది ఎమ్మెల్యే కారును ఢీకొట్టింది. ఇలా నాలుగు కార్లు ఒకదాని నొకటి ఢీకొన్నాయి. వెంటనే వాహనాల్లోని ఎయిర్ బ్యాగులు తెరుచుకున్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. నాలుగు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఎవరికీ గా యాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బిడ్డ పుట్టినరోజే.. నాన్న ఆత్మహత్య



రాజు (ఫైల్)

ఉండవెల్లి: కొడుకు జన్మించిన రోజే ఓ తండ్రి బలవన్మర ణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లిలో చోటు చేసుకుంది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న రాజు (29)కు కొన్నేళ్ల క్రితం గీతతో వివాహమైంది. వారిద్దరికి పాప, కుమారుడు ఉండగా.. ఆదివారం మూడో సంతానంగా మగ బిడ్డ అలంపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించాడు. కుమారుడిని చూసి వచ్చిన రాజు.. మధ్యాహ్నం వేళ ఇంట్లోనే ఉరివేసు కుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మ హత్యకు గల కారణాలు తెలియడం లేదని అతని తల్లిదండ్రులు, స్థానికులు చెబుతు న్నారు.

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో బోటు షికారు



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయంలో ఆదివారం పర్యాటకులు బోటు షికారు చేశారు. సందర్శకులతో ప్రాజెక్టు పరిసరాల్లో కోలాహలం నెలకొంది. పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 387 మంది పర్యాటకులు తరలిరాగా తద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.13,665 ఆదాయం లభించింది. 230 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్‌కు రూ,12180 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్ : రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు ఖమ్మం మిర్చి మార్కెట్ యార్డ్‌ను సందర్శించనున్నారు. 8.15 గంటలకు ఖమ్మం నుంచి బయలుదేరి 10 గంటలకు భద్రాచలం చేరుకుంటారు. అక్కడి సబ్ కలెక్టరేట్‌లో శ్రీరామనవమి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కొత్తగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. 1.30 గంటలకు అక్కడ బయలుదేరి 2.30 గంటలకు ఖమ్మం చేరుకుంటారు. సాయంత్రం4 గంటలకు చింతకాని మండలం నాగులవంచలో డీసీసీబీ గోడౌన్‌ను, 4.30 గంటలకు బోనకల్ మండలం గార్లపాడులో పంచాయతీ కార్యాలయ భవనాన్ని, 5 గంటలకు ప్రొద్దుటూరులో హెల్త్ సబ్ సెంటర్, పాఠశాలలో నిర్మించిన అదనపు గదిని ప్రారంభిస్తారు. తిరిగి 6.15 గంటలకు ఖమ్మం చేరుకుంటారు.

కేటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణ

పాల్వంచ: కేటీపీఎస్ 7వ దశలో విద్యుదుత్పత్తిని ఆదివారం పునరుద్ధరించారు. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా 12వ యూనిట్‌లో గురువారం నుంచి 800 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచింది. సీఈ పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరమ్మతులు పూర్తిచేసి ఆదివారం రాష్ట్ర గ్రిడ్‌కు ఉత్పత్తిని అనుసంధానం చేశారు.

మార్కుల తనిఖీలు పూర్తి

- ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రతీ పేపర్‌లో 20 మార్కులు
- పాఠశాలల్లోనే పరీక్ష, మార్కుల కేటాయింపు
- ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టిన అధికారులు
- ఆన్‌లైన్‌లో నమోదుకు నేటితో ముగియనున్న గడువు



రఘునాథపాలెం మండలం వేపకుంట్ల ఉన్నత పాఠశాలలో ఇంటర్నల్ మార్కులు తనిఖీ చేస్తున్న బృందం (ఫైల్)

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలోని పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల తనిఖీ పూర్తయింది. వార్షిక పరీక్షలు వచ్చే నెలలో జరగనున్న నేపథ్యాన అధికార యంత్రాంగం విద్యార్థుల ఇంటర్నల్(అంతర్గత) మార్కులపై దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలల్లో మార్కుల తనిఖీలు, రికార్డుల పరిశీలన పూర్తికాగా.. ఆన్‌లైన్‌లో నమోదు చేసే గడువు సోమవారం ముగియనుంది. దీంతో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

ఇంటర్నల్ మార్కులు ఇలా..

పదో తరగతిలో ప్రతీ సబ్జెక్ట్ పేపర్‌కు 100 మార్కులు కేటాయిస్తారు. అయితే, ఇందులో 80 మార్కులు థియరీ, 20 మార్కులు విద్యార్థులు పాఠశాలలో నిర్వహించే నిర్మాణాత్మక మూల్యాంకనం(ఎఫ్ఏ)లో సాధించిన మార్కులు ఉంటాయి. అంటే విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్ట్ పనులు, రికార్డులు రాయడాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ మార్కులు కేటాయిస్తారు. తద్వారా ఈ మార్కులు వార్షిక పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముంటుంది.

ఈ మార్కులు కీలకమే...

పదో తరగతి విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులు కీలకం కానున్నాయి. మార్కుల కేటాయింపులో అవకతవకలు జరగకుండా అధికారులు పర్యవేక్షించారు. ఇప్పటికే మండల స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు పూర్తి చేశారు. మార్కుల నమోదు పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీటి ఆధారంగా ఉత్తీర్ణత శాతం పెరగడం, తగ్గడం ఆధారపడి ఉండడంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలల బాధ్యులు తనిఖీలకు వెళ్లిన బృందాలను మచ్చిక చేసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నా.. అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు.

అంతంత మాత్రంగానే తనిఖీలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, ప్రైవేట్ పాఠశాలలు 837 ఉండగా వీటన్నింట్లో 29,363 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో వీరికి సంబంధించిన ఇంటర్నల్ మార్కుల ప్రక్రియను తనిఖీ చేసేందుకు ఖమ్మం జిల్లాలో 37 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో పాఠశాల హెచ్ఎంతో పాటు ముగ్గురు నుంచి నలుగురు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను సభ్యులుగా నియమించారు. కాగా, ఇంటర్నల్ మార్కులను తనిఖీ చేసేందుకు వెళ్లిన బృందాలు ఆయా పాఠశాలల్లో తనిఖీ అనంతరం నివేదికలో ఓ కాపీని హెచ్ఎంకు, ఇంకో కాపీని ఎంఈఓకు అందజేయాల్సి ఉంటుంది. ఎంఈఓలకు అందజేసిన వివరాలు, స్కూళ్లలో ఆన్‌లైన్ చేసిన వివరాలు సరిపోతే అక్కడి నుంచి నివేదిక డీఈఓ కార్యాలయానికి చేరుతుంది. కాగా, తనిఖీలకు వెళ్లిన బృందాలు పలు ప్రభుత్వ పాఠశాలల్లో మార్కుల జాబితాలో మార్పులు చేశారని తెలుస్తోంది. అదే ప్రైవేట్ పాఠశాలల విషయానికొచ్చే సరికి దాదాపు విద్యార్థులందరికీ 20కి 20 మార్కులు వేసినా చూసీచూడనట్లుగా వ్యవహరించి యజమాన్యాలకు వత్తాసు పలికారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఉన్నత పాఠశాలలు, విద్యార్థుల వివరాలిలా...

	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
ప్రభుత్వ, అనుబంధ హైస్కూళ్లు	282	164
విద్యార్థులు	10,698	6,777
ప్రైవేట్ హైస్కూళ్లు	221	125
విద్యార్థులు	6,175	3,446
మొత్తం హైస్కూళ్లు	503	334
మొత్తం విద్యార్థులు	16,873	12,490

ఆన్‌లైన్‌లో నమోదుపై దృష్టి



ప్రభుత్వ ఆదేశాల మేరకు అంతర్గత మార్కుల నమోదు పరిశీలన పూర్తయింది. ప్రస్తుతం విద్యార్థుల వారీగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం లోగా ఈ ప్రక్రియ పూర్తయితే, 23 నుంచి 25వ తేదీ వరకు మా కార్యాలయానికి పంపించాలి. ఇంటర్నల్ మార్కుల నమోదు పరిశీలన, ఆన్‌లైన్ నమోదు అంతా పారదర్శకంగానే జరుగుతుంది.

– సోమశేఖరశర్మ, జిల్లా విద్యాశాఖాధికారి

సింగరేణిలో టార్గెట్ టెన్షన్..!

- వార్షిక లక్ష్యం 70.66 మిలియన్ టన్నులు
- నేటికి 68.88 మిలియన్ టన్నుల వెలికితీత
- రోజుకు ఉత్పత్తి 2.35 లక్షల టన్నులు మాత్రమే
- మిగిలిన 10 రోజులకు 6.78 మిలియన్ టన్నుల టార్గెట్
- 117 శాతం ఉత్పత్తితో ఆర్జీ–1 ఏరియా ముందంజ



బొగ్గు ఉత్పత్తి చేస్తున్న కార్మికులు(ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఏడాది 2022–23 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యం 70.66 మిలియన్ టన్నులు. అయితే సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని 24 భూగర్భగనులు, 18ఓపెన్‌కాస్ట్ గనుల్లో గడిచిన 11 మాసాల 20రోజుల్లో 70.66 మిలియన్ టన్నుల లక్ష్యానికి 63.88 మిలియన్ టన్నులు 90 శాతం మాత్రమే ఉత్పత్తి సాధించింది. ఇంకా 6.78 మిలియన్ టన్నుల వెనుకంజలో ఉంది. అయితే ప్రస్తుతానికి సింగరేణి సంస్థ రోజుకు 2.75 లక్షల టన్నుల ఉత్పత్తిని ఎంచుకొని రోజుకు 2.35 లక్షల టన్నుల ఉత్పత్తిని మాత్రమే సాధిస్తుంది. అయితే ఈ ఏడాది నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యం సాధించాలంటే రోజుకు కనీసం 6 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించాల్సి ఉంది. గడచిన మూడేళ్ల నుంచి సింగరేణి ఇదే ఒరవడితో ఉత్పత్తి వెనుకంజలో నడుస్తుంది. ఈ ఏడాది కూడా నిర్దేశించుకున్న లక్ష్యం కష్టతరంగా మారిందని అధికారులు చర్చించుకుంటున్నారు.

ముందస్తు ప్రణాళికలు లేకపోవటమే ప్రధాన కారణం..

సింగరేణి సంస్థ గత మూడేళ్లుగా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించలేకపోవటానికి కారణం ముందస్తు ప్రణాళిక లేకపోవడమేనని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి సీ అండ్ ఎండీ ప్రతినెలా 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఏరియా జీఎంలు, గనుల మేనేజర్లు, ప్రాజెక్ట్ అధికారులు, ఇతర హెచ్ఓడీలతో రోజుకు ఒక విభాగం అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వారికి రోజు, నెల వారి ఉత్పత్తితో పాటు రవాణాను సాధించాలని ఆదేశాలు జారీ చేయటమే కాకుండా ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచిస్తున్నారు. సీ అండ్ ఎండీ చెప్పిన సమయంలో డూడూ బసవన్నలా తలూపుతూ ఏరియాకు వచ్చిన తర్వాత వారి పద్ధతిని వారు కొనసాగిస్తున్నారు. తీరా టైమ్ దగ్గపడేకొద్ది తమపై పెనుబారం పెట్టి అధికారులు హడావుడి చేసినంత మాత్రాన అయ్యేంత వరకు అవుతుంది కానీ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేమని కార్మికులు వాపోతున్నారు. అధికారులు శ్రద్ధ చూపితే ఈ లక్ష్యం పెద్దదేమి కాదని, ఏరియా ఉన్నాతాధికారుల అలసత్వమే కొంత కారణమని కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వివిధ ఏరియాలు సాధించిన ఉత్పత్తి వివరాలిలా..

ఏరియా	నిర్దేశిత లక్ష్యం	సాధించినది	శాతం
కొత్తగూడెం ఏరియా	1,33,61,784	1,21,97,829	91
ఇల్లెందు ఏరియా	43,52,160	46,83,214	108
మణుగూరు	1,10,93,692	1,16,75,000	105
బెల్లంపెల్లి ఏరియా	34,20,000	26,94,511	79
మందమర్రి ఏరియా	52,01,739	40,98,476	79
శ్రీరాంపూర్ ఏరియా	63,73,231	63,73,231	100
ఆర్జీ–1 ఏరియా	37,44,246	43,75,412	117
ఆర్జీ–2 ఏరియా	81,51,539	82,40,303	101
ఆర్జీ–3 ఏరియా	59,04,615	53,31,587	90
ఆండ్రియాల ప్రాజెక్ట్	20,48,262	15,70,459	77
భూపాలపెల్లి	47,21,385	26,47,246	56
భూగర్భ గనులు	85,37,417	65,97,559	77
ఓపెన్ కాస్ట్ గనులు	6,21,27,544	5,72,89,875	92
మొత్తం	7,06,64,961	6,38,87,434	90

40 క్వింటాళ్ల తలంబ్రాల బియ్యం వితరణ



తలంబ్రాల బియ్యాన్ని అందజేస్తున్న భక్త మండలి సభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 30న జరగనున్న రామయ్య కల్యాణంలో వినియోగించేందుకు 40 క్వింటాళ్ల తలంబ్రాల బియ్యాన్ని ఆదివారం వితరణగా అందజేశారు. భూపాలపల్లి జిల్లాకు చెందిన శ్రీ రామదాసు భక్త మండలి ఆధ్వర్యంలో ఆలయానికి చేరుకున్న పలువురు.. బియ్యాన్ని దేవస్థానం అధికారులకు అప్పగించారు.

రూ.30 లక్షల విలువైన ముత్యాలు..

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ప్రతి సోమవారం అలంకరించే ముత్తంగి రూపానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ అలంకరణలో స్వామివారికి ముత్యాల హారాలు వేస్తారు. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఆదివారం రూ.30 లక్షల విలువైన ముత్యాలను అందజేశారు. దీంతో వచ్చే సోమవారం(ఈనెల 27న) చేసే ముత్తంగి అలంకరణలో ఈ ముత్యాలను వినియోగించనున్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



ఓసీ వ్యూపాయింట్ నుంచి బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–4 వ్యూపాయింట్ వద్ద నుంచి గనిలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అధికారులు డి.లలిత్‌కుమార్, శ్రీనివాసచారి, నర్సిరెడ్డి, శ్రీనివాస్, అబ్దుల్ షబ్బీరుద్దీన్ పాల్గొన్నారు.